# త్యాగము

బి. లక్ష్మీనారాయణరావు

రాత్రి తొమ్మిదిగంటల సమయం. వాన కురిసి అప్పుడే వెలిసింది. కాని ఆకసంలో మోడము లాడుతూనేవున్నాయి. వెంకటిరెడ్డియింటి హాలులో 'పెట్రొమాక్సు' వెలుగుతూవుంది. హాలునడుమ నొక చిన్నబల్ల, దానిపై పుష్పములుంచుట కుపయోగించు గాజుకుప్పె, గోడలనానుకొని నాలుగు పేముకుర్చీలు, లక్ష్మీసరస్వతులపటములు, వివేకానంద, గాంధి, దయానందసరస్వతి, టాగోరు, సరోజినీదేవి-వీరి ఛాయాచిత్రములు గోడలపై నందందు వేలాడుచున్నవి. తలవాకిలి కెదురుగా నొకగడియారం. హాలు కిరుప్రక్కల రెండు గదులు. ఒకటి ఆఫీసుగది. రెండవది వెంకటరెడ్డి పడక గది. హాలుముందు వరాండా, వెనక చిన్నలోగిలి. వెంకటరెడ్డిపడకగది నానుకొని, అతనిభార్య సీతమ్మ విశ్రాంతిగదిన్ని, యీభాగమున కైదుగజముల దూరమున భోజనస్నానాదికముల కుపయోగించు మూడు చిన్నగదులున్నూ గలవు.

వెంకటరెడ్డి అప్పుడే భోజనంజేసి సిగరెట్టు కాలుస్తూ కుర్చీలో కూర్చున్నాడు. ముప్పదియేండ్ల వయస్సు. వకీలువృత్తిలో ప్రవేశించి ఆరేండ్లయింది. మంచి చాకచక్యం గలవాడనే పేరుతెచ్చుకున్నాడు. నెలకు రెండునూర్లకు తక్కువకాని సంపాదన వున్నదని వినికిడి. పిత్రార్జితమైన భూస్థితికూడా తగినంత కలదు. ఇతనిభార్య సీతమ్మ మంచి మర్యాదస్థుల యింటి యాడుబిడ్డ. పేరునకుతగిన గుణసంపదకలిగి మగని యనురాగాన్ని పొందింది. ఇప్పుడు మూడుమాసముల గర్భవతి. వెంకటరెడ్డి అన్నివిధముల అదృష్టవంతుడనిచెప్ప వచ్చు. మిక్కిలి ఉత్సాహపరుడుకూడను. సాంఘిక విషయములం దెక్కువశ్రద్ధ. ప్రస్తుతం హిందూసంఘంలోవుండే దోషాలను తొలగించి, సంఘాన్ని సంస్కరించవలెనని మిక్కుటమగు ఆశ. 'హిందూ యువజన సంఘ' మనుపేర నొకసమాజం స్థాపించి, దానికి తాను కార్యదర్శియై ప్రతివార మేదో యొకసభ జరిపిస్తూ వుంటాడు. హిందూసంఘమున బాలవితంతువుల దుస్థితి, స్త్రీల బానిసత్వం, పురుషుని స్వార్థం వీటినిగూర్చి దీర్ఘోపన్యాసములిస్తూ కార్యతః కాకపోయినా, తన శక్తికొలది తానూ సంఘసేవ చేస్తున్నానని మురిసిపోతుంటాడు.

కుర్చీలో కూర్చొని సిగరెట్టు కాలుస్తూ, ఆ సాయంకాలం తాను దుర్మార్గుల బారినుండి రక్షించిన యనాథ బాలికల భావిజీవితాన్ని గూర్చి యోచిస్తున్నాడు.

ఇంతలో సీతమ్మ తాంబూలంతట్టతో ప్రవేశించింది. వయసిరువదిరెండేండ్లుంటును. అట్టే పొడగరి కాదు. కాయకష్టమున కోర్వని సలుచని దేహం. చామనచాయ. చక్కనివారలలో చేర్పదగిన సౌందర్యం. ముఖం శాంత గంభీరభావములకు నెలవు.

సీతమ్మ—ఏమి చాల యోచన చేస్తున్నారు?

వెంకట—రాణిగా రింకనూ రాలేదే అని.

సీతమ్మ—చాల్లెండి. ఎప్పుడూ మీకుహాస్యమే.

వెంకట—ఎప్పు డెప్పుడు హాస్యంచేయవచ్చో సెలవిస్తే....................

సీతమ్మ—మీ పుణ్యం వూరుకోండి. ఆపిల్లలు వినేరు.

వెంకట—అన్నట్టు, ఏరీ వాళ్లు?

సీతమ్మ:— భోజనా లయినాయి. నేవద్దంటూంటే తట్టలుకడుగుతున్నది నాగమ్మ. లక్ష్మి వంటిల్లు చక్క పెట్టుతూంది.

వెంకట:—ఆ చిన్నదానిపేరా లక్ష్మి? భేష్! పేర్లుకూడా కనుక్కున్నావే అప్పుడే.

సీతమ్మ—పేర్లేనా! వాళ్ల చరిత్రకూడా కనుక్కున్నా. పాపం, నా కయ్యో అనిపిస్తుందండి. ఈవాళ మీరు లేకపోతే ఆపిల్ల జీవితం నాశనమయ్యేది.

వెంకట—మన సంఘంలో యెంతమంది స్త్రీల జీవితము లిట్లు పాడయినారో ఎవరికి తెలుసు. తమ మానప్రాణాలను కాపాడుకోలేని దీనదశలో వున్నారు హైందవస్త్రీలు. పేపర్ల లో నిత్య మిట్టివిషయ మొక్కటైనా వుండితీరుతుంది. మగదిక్కులేని వయసువచ్చిన పిల్లలను బలాత్కారంగా యెత్తుకొని పోవడం అసహాయులైన స్త్రీలను మానభంగం చేయడం, ఆడ:ల్లలను దొంగిలించుకొనిపోయి, పెంచి, పాపవృత్తికి దింపడం—ఒక్కటా!

సీతమ్మ—ఆదుర్మార్గులనుపట్టి సర్కారువారు జైలు కెందుకు పంపగూడదు?

వెంకట—వాండ్లపరం వాదించి వాళ్లను తప్పించడానికి మా వకీళ్లున్నారుకదూ! తమ ఫీజువస్తే చాలు, యెట్టికేసైనాసరే. జాత్యభిమానం, కులస్త్రీగౌరవం మనవాళ్ల లోవుంటే, మనసంఘాని కిట్టిదుర్దశ యెందుకు సంభవిస్తుంది! ఏజాతియొక్క జీవితమునకుగాని, పురోభివృద్ధికిగాని స్త్రీపాతివ్రత్యమే పునాదియని, అట్టి స్త్రీపాతివ్రత్యాన్ని రక్షించేభారం ప్రతిపురుషునిపైననూ వున్నదని మనవాళ్లు గ్రహిస్తే, మనస్త్రీల నెవ్వడు తేరిపారచూడగలడు. ఈవిషయంలో మనహిందువులకంటె మహమ్మదీయులు వేయిరెట్లు మేలు. వారికున్న కులాభిమానం, వారిస్త్రీలగౌరవం నిలబెట్టుకోవడంలో వారుచూపు సాహసం, తెనువ అపారం.

సీతమ్మ—మరి యిప్పుడీపిల్లల గతేమండి? ఎవరూ దిక్కులేరే.

వెంకట—ఎవ్వరూ బంధువులేలేరా? వాళ్ల సంగతి కనుక్కున్నావా?

సీతమ్మ—విచారించినాను. ఈపిల్లలకు చిన్నతనాన్నే తల్లి చనిపోయింది. తండ్రి పెంచి పెద్దజేసినాడు. పెద్దపిల్లను తగుమైనచోటనే యిచ్చినాడుకాని, యీపిల్ల దురదృష్టం, సంవత్సరంలోనే మగనిని పోగొట్టుకొని పుట్టినిల్లుచేరింది. తండ్రివున్నన్నాళ్లూ యెట్లో పిల్లల్నిద్దర్నీ సాకినాడు. ఆతండ్రి పోయి యిప్పటికి ఆరునెల్లయింది. వున్నకొంతభూమి యీపిల్ల పెండ్లికి జేసిన అప్పులకు పోయింది. పల్లెలో బ్రదుకుదెరువులేక యీవూర్లో బ్రదుక్కుందామని చెల్లెల్తో వచ్చింది. వూరుచేరీచేరకమునుపే యెవరో దుర్మార్గులు బాధించడం. మీరాసమయానికి రాకపోతే వీళ్లగతి యేమయ్యేదో!

వెంకట—పెద్దపిల్ల మంచిధైర్యస్థురాలుగా కనపడుతుంది. కాని యేవిధంగా యీవూర్లో జీవనం చేస్తారని తోచడంలేదు.

సీతమ్మ—ఎవరైనా మర్యాదస్థులు తమఇంట్లో పెట్టుకుంటే యింటి పనంతా చేసుకుంటూవుంటారు. అదికాక, యిద్దరూ చిన్నవయసులో వున్నారు. వంటరిగా వుండడం కష్టం.

వెంకట—నిజమే కాని, అట్టివాళ్లెవరున్నారు. విచారించితేగాని తెలీదు.

సీతమ్మ—మనింట్లోనేయెందుకుండగూడదండి? ఇప్పట్లో నాకూడా సహాయ మెవరూలేరు.

వెంకట—ఓహో! ఇదాయెత్తు? బాగనేవుంది. ఇద్దరిని మనం భరించగలమా?

సీతమ్మ—ఇప్పుడు మీరు జవానుకు పదిరూపాయ లిస్తున్నారు కదండి. వాడేంపని జేస్తున్నాడు? వాణ్ణి పంపివేయవలెనని మీరుకూడా అంటున్నారు. ఇంటిపనులకు సహాయంలేదు. మీరు వూరికిపోయినప్పుడు నాకు తోడుకూడా లేరు. ఈ పిల్లలయితే యింట్లోనే వుంటారు. నా కన్నివిధములా సహాయం.

వెంకట—నీ కిష్టంవచ్చినప్పుడు ఆర్గ్యుమెంటు కేంకొదవ. కానీ వాళ్ల నడిగి కనుక్కో, మనింట్లో వుండడాని కిష్టపడతారేమో?

సీతమ్మ—అది నాకు వదలండి. మీకిష్టమయితే వాళ్లుండడానికేమి?

వెంకట—నీ ఇష్టమని చెప్పకూడదూ! మీకు వ్యతిరేకంగా మగవాళ్లు నడిస్తే వుందిగా సత్యాగ్రహం.

సీతమ్మ—అబ్బా, గడుసుదనం! మీ మగవాళ్లు చేసే ప్రతిపనీ ఆడవాళ్ల యిష్టప్రకారమేనేమో? చాలు వూరుకోండి.

ఇంతలో నాగమ్మ చెల్లెలితో వచ్చి వాకిటివద్ద తలవంచుకొని నిలబడింది. నాగమ్మ కిరువదియేండ్ల వయస్సు. పొడవరి. పొలముపని కలవాటుపడిన బలిష్ఠమగు దేహం. మంచిచాయ. ముఖం తీర్చి తిద్దినట్లుంది. ఈకాపుబిడ్డ సహజసౌందర్యానికి చూపరులహృదయాలనట్టె యాకర్షించగల శక్తివుంది. చెల్లెలు లక్ష్మ్మ అన్ని విధముల అక్కనుపోలినది. అక్క వెనుకఒదిగి సీతమ్మ ముఖం చూస్తూ నిలబడింది. జాతిముత్తెములవలెనున్న ఈ యక్కచెల్లెండ్ర నిప్పుడు తేరిపారజూచి, వెంకటరెడ్డి చకితుడైపోయినాడు.

సీతమ్మ—నాగమ్మా, మీకిష్టంవచ్చినన్నినాళ్లు మా యింట్లోనే వుండొచ్చు. నాకూ అక్కచెల్లెండ్లులేరు. మనం వకతల్లిపిల్ల లున్నట్టుందాం.

నాగమ్మకు నోట మాట రాలేదు. వంచినతల యెత్తి, తన విశాలమగు కన్నులతో సీతమ్మముఖం చూస్తూ నిలబడిపోయింది.

౨

ఐదుమాసము లయింది. నాగమ్మ చెల్లెలితో వెంకటరెడ్డియింట యెంతో భయభక్తులతో కాలంగడపుతూవుంది. దిక్కులేని యీ యక్కచెల్లెండ్రను సీతమ్మ యెంతో ఆదరిస్తూ, తనతోబుట్టువులవలె చూస్తూంది. నెలక్రింద లక్ష్మ్మ వ్యక్తురాలయినప్పుడు సీతమ్మ యెంతోసంతోషంతో నలుగురినీ అమ్మలక్కలనుజేర్చి నలుగుబెట్టింది. వెంకటరెడ్డికూడా వీరినెంతో అభిమానంతో చూస్తూన్నాడు. నాగమ్మ ధైర్యము, చాకచక్యము వెంకటరెడ్డిమెప్పును బొందినవి. కాపుబిడ్డలలో ఆదర్శప్రాయురాలు నాగమ్మ అని వెంకటరెడ్డి నిశ్చలమైన యభిప్రాయం. ఇంటిపనులలో మగ్నయై, నాగమ్మ యటునిటుతిరుగుతూన్నపుడు రెడ్డి యామెను త్రిప్పనిచూపులతో చూస్తూ తన్నుదా మరచిపోతుంటా డొకప్పుడు. అంతలో తెలివి దెచ్చుకొని తా నటుచూడడం భావ్యంకాదని తన్నుదా విమర్శించుకుంటాడు. కాని నాగమ్మ తనకంటబడినంతనే నిశ్చలుడైపోతాడు. సోదరిగా జూచుకోదగిన యీయనాథయందు తానట్లు లక్ష్యముంచడం పాపమని నిశ్చయించుతాడు కాని మరుక్షణమే తనకెట్టి పాపపుటూహయు లేదే యని తన్నుదా సమర్థించుకొంటాడు. తన హృదయంలో రేగుతూవున్న భావాలకుమాత్రం అంతం లేదు. సాధ్యమైనంతమట్టుకు నాగమ్మవైపు కన్నెత్తి చూడక తనమనసును శాంతింపజేయవలెనని గట్టి ప్రయత్నం చేసినాడు. కాని తనహృదయంలో చిత్రితమై తనకండ్లలో ప్రతిబింబిస్తూన్న ఆరూపాన్ని ఎట్లు తుడిచివేయగలడు? ఆమెవైపు చూడకూడదను తలపు నిశ్చలంగా వుంది కాని, చూపు లప్రయత్నంగా ఆమె విగ్రహాన్ననుసరిస్తున్నవి. ఇట్టిస్థితిలో తేనెలోబడిన ఈగవలె కొట్టుకొంటున్నాడు వెంకటరెడ్డి.

ఇటు నాగమ్మ తనపాలిటిదైవమువలె భావిస్తున్నది వెంకటరెడ్డిని. ఇంతటి యుదార హృదయుని యింట తనకాశ్రయం దొరకడం తన పూర్వజన్మసుకృతమని యెంచి యతని నెంతో భక్తి గౌరవములతో చూచుకొంటూ వుంది. నిత్యమూ రాత్రి భోజనానంతరం వెంకటరెడ్డి భార్యకు వార్తా పత్రికలలోని విశేషములు జెప్పుతూ, సందర్భాన్ని బట్టి సాంఘిక విషయాలను గూర్చి యుపన్యసిస్తూంటే నాగమ్మ యాలోకాన్నే మరచి వెంకటరెడ్డి మాటలను వింటూ కూర్చుంటుంది. పల్లెటూరిలో పుట్టి పెరిగిన యీ ముగ్ధ యితని నొక దేవాంశసంభూతునిగా నెంచింది. బాల వితంతువుల దుస్థితిని వెంకటరెడ్డి జాలిపుట్టినట్లు వర్ణిస్తూ వుంటే ప్రపంచములోని దుఃఖాన్ని అంతం చేయడానికై పుట్టిన మహానుభావు డితడని తన విశాలమైన కండ్లతో అతన్ని ఒకటే చూపుగా చూస్తూ వుండేది. వెంకటరెడ్డి తన్ను చూస్తూవుండడం మొదట మొదట గమనించలేదు కాని, కొన్నాళ్లకు తన్నదే పనిగా దృష్టించి చూస్తూన్నాడనే విషయం గ్రహించింది. ఆచూపులకేమిన్నీ అర్థంచేయలేకపోయింది.

ఒకప్పుడిరువురి చూపులు తటస్థమైతే నాగమ్మ కొక విధమగు భీతిచే దేహం జలదరించేది. తలవంచుకొని

యట్లే నిలబడి పోయేది. ఆభీతి కేమికారణమో తన కే మాత్రం అర్థమయ్యేదికాదు.

ఒకనాడు మధ్యాహ్నం మూడు గంటల సమయం. సీతమ్మ లక్ష్మిను వెంటబెట్టుకొని పాతూర్లో పరిచయస్థుల యింటికి వెళ్లింది.

నాగమ్మ వంటయింట రొట్టెలుచేస్తూ కూర్చుని పరధ్యానంగా వుంది. ఇంతలో వెనక అడుగుల చప్పుడు విని వులిక్కిపడి తిరిగి చూచింది. అప్పుడే వెంకటరెడ్డి కోర్టునుండివచ్చి కాఫీకోసం వంటయింటికి వచ్చినాడు. నాగమ్మ తటాలునలేచి చెరగు సవరించుకొని తలవంచి నిలబడింది.

వెంకట—ఇంట్లో యెవరూ వున్నట్టులేదు?

నాగమ్మ—అమ్మగారు లక్ష్మిను పిలుచుకొని పాతూర్లోకి పోయినారు. ఇంతలోరావచ్చు.

వెంకటరెడ్డి తిరిగిపోయినాడు. అతడు పోయిన తర్వాత కాఫీయివ్వలేదని నాగమ్మకు జ్ఞాపకంవచ్చింది. కాఫీకప్పు తీసికొని వెంకటరెడ్డిరూముకు వెళ్లింది. రూములో అద్దంముందరనిలబడి వెంకటరెడ్డి కాలరు తీస్తున్నాడు. నాగమ్మ వాకిటనిలబడి కాఫీ తెచ్చినావని చెప్పింది. తెమ్మన్నాడు. నాగమ్మ రూములోకి వెళ్లి కాఫీఅందించునప్పుడకస్మాత్తుగా అతనిచేయి సోకింది. ఆమె దేహ మాద్యంతం జలదరించింది. వెంకటరెడ్డి పరవశుడయినాడు. కాఫీకప్పు టేబిలుపైనుంచి, "నీవు కాఫీతీసుకున్నావా" యని యడిగినాడు. ఇదివర కిట్టి ప్రశ్న యెప్పుడునూ అడిగినదిలేదు. తన్ను అంతటి కారుణ్యంతో ప్రశ్నించువా రున్నారని నాగమ్మ కలనైన దలపలేదు. తలయెత్తి అశ్రువులతోనిండిన కన్నులతో వెంకటరెడ్డిముఖాన్ని చూచింది. వెంకటరెడ్డి భౌతికప్రపంచాన్నే మరచినాడు. నాగమ్మను తన బాహువులతో హృదయమున జేర్చుకున్నాడు. నోట మాటలేక అతనిబాహువులలో వాలిపోయింది నాగమ్మ.

## 3

క్రిసుమసు సెలవులు. సీతమ్మతమ్ముడు కృష్ణారెడ్డి అక్కను కాన్పుకు పిలుచుకొనిపోవడానికి అనంతపురం వచ్చినాడు. ఇదివరకూ రెండుకాన్పులు సీతమ్మకు పుట్నింటినే జరిగినవి. కాని, పాపం రెండు మార్లునూ పిల్లలు పురిటింటనేపోయిరి. ఈసారి పుట్నింటికిపోవడం సీతమ్మ కిష్టంలేదు. పైగా మూడవకాన్పు పుట్నింట జరుగకూడదని నలుగురూ అంటారు. ఇంట తనకు నాగమ్మ సహాయంకూడా వుందనిచెప్పి తమ్ముణ్ణి సమాధాన పరచింది. సెలవులు నాలుగు రోజులూ యిచ్చటనే గడపమని బావకూడా కోరినందున కృష్ణారెడ్డి నిలిచినాడు. క్రిష్ణారెడ్డి కిరవైయేండ్ల వయస్సు. స్కూలు ఫైనలుపాసయి, ట్రైనింగు ముగించుకొని స్వగ్రామమగు తాటిపర్తిలో స్కూలుమాస్టరుగా వున్నాడు. నెలకు ముప్పై రూపాయీల జీతం. కొద్దిగా భూస్థితి కూడావుంది. తండ్రి బాల్యంలోనే గతించినాడు. తల్లి గారాబంతో పెంచింది. సీతమ్మకితనిపై యెంతో మక్కువ. సీతమ్మ వివాహమైన తర్వాత అక్కయింటనే యుండి చదివినాడు కృష్ణారెడ్డి.

గుణవతియైన పిల్లను దెచ్చి తమ్ముని నొక కుటుంబీకునిగా చేయవలెనని సీతమ్మ ప్రయత్నంజేస్తూవుంది. తనమనసులో లక్ష్మి మెదలుతూనే వుంది. ఆపిల్ల గుణాన్ని బాగా తరచిచూచింది. ఇంతటి చాకచక్యము, వినయము, విధేయత గలిగినపిల్లలు తమజనంలో దొరకుట అరుదని నిశ్చయించింది దానికితోడు మంచి రూపవతి లక్ష్మి. అన్నివిధముల సీతమ్మ మనస్సుకు లక్ష్మి బాగానచ్చింది. కాని, తమ్ముని మన సెట్లుందో, తల్లి యిట్టిబీదపిల్లను కోడలిగా జేసుకోడాని కిష్టపడుతుందో లేదో అను సందేహం సీతమ్మకు. తమ్ముడు వచ్చిన రెండురోజులకే సీతమ్మ మొదటి సందేహంతీరింది.

ఇదివరకు క్రిష్ణారెడ్డి అనంతపురంవస్తే యింట వుండడమే అరుదు. ఎప్పుడూ స్నేహితుల్తో కాలం గడిపేవాడు. ఈసారి సదా యింటనే ఉండడం. లక్ష్మి సీతమ్మవద్ద యున్నప్పుడు క్రిష్ణారెడ్డి యేదో మిషపైన వచ్చి కూర్చుని కబుర్లుచెప్పడ మారంభించినాడు. సీతమ్మ వెనుకనుండి లక్ష్మి క్రిష్ణారెడ్డిని పిళపిళ చూస్తూవుండేది. మధ్యాహ్నం 'క్యారం' (Carrom) ఆడవలెనంటే తప్పకుండా క్రిష్ణారెడ్డి లక్ష్మీ లొకజట్టు. ప్రతియాటా

వెంకటరెడ్డి సీతమ్మలకు ఓటమి తప్పిందికాదు. ఒకసారి వెంకటరెడ్డి "ఈ ఆలుమగండ్లు మనల్ని బాగా ఓడగొట్టుతున్నారే ప్రతిమాటా"యని నవ్వుతూఅన్నాడు సీతమ్మముఖంచూస్తూ. సీతమ్మ పకు్కననవ్వింది. కృష్ణారెడ్డికూడా నవ్వినాడు. సిగ్గుతో లక్ష్మి వంటింటిలోకి పరుగెత్తిపోయింది.

సీతమ్మ—ఈసూజోడూ బాగుందికదేమండీ?

వెంకట—నీవదేపనిగా తయారుచేస్తున్నావుగా పిల్లను. మొగానికి సబ్బు రాసుకోవడం నేర్పినావు. నీచీరలు కట్టపెట్టుతుంటావు. చదువు నేర్పుతున్నావు. వెంటబెట్టుకొని స్నేహితుల యిండ్లకు పోతుంటావు. అన్నివిధములా పట్నవాసంపిల్లగాతయారుచేస్తున్నావు. ఇంతశ్రద్ధ మరదలిని చేసుకోడానికేకాదూ.

సీతమ్మ—ఎంత అన్యాయమండీ! ఏదో, పిల్ల చలాకీగావుందని నాకు వచ్చినంత చదువు చెప్పడం, శుభ్రంగావుండమని చెప్పడమూ, ఎవరింటికైనాపోతే తోడుపిలుచుకొనిపోవడమూ తప్పా. వీటికన్నిటికి వక కారణమా? చాల్లేండి.

వెంకట— కారణ ముందోలేదో యిప్పడెందుకు? శ్రమ ఫలించిందిగా. నాకూ సంతోషమే. ఏమోయి కృష్ణారెడ్డీ, నీయభిప్రాయమేమి?

సీతమ్మ—వాన్నడగడమెందుకు? వాని యభిప్రాయం నాకు బాగాతెలుసు. మీ రీసారి తాటిపర్తి పోయినప్పుడు మీయత్తగారితో మాట్లాడిరండి. మిగత విషయం నేనుచూస్తాను.

వెంకట—నీవు తలచింవాని కడ్డేముంది? కాని, పిల్ల నాది. సీతమ్మకు సొమ్మేం పెడతాడు?

సీతమ్మ—అబ్బా! పిల్లమీది? మీరేఅన్నారు కాదూ పిల్లను నేను తయారుచేసినానని. పిల్ల నాది. పిల్ల వారిపరంగా సొమ్ము మీరే పెట్టవలసింది.

వెంకట— చాల గట్టిదానివేలే. కానీ, కాఫీ అయిందేమో చూడుపో.

## ౪

ఏప్రిలు నెలారంభం. ఎండలు తీక్ష్ణంగా వున్నాయి. సీతమ్మ ప్రసవించి రెణ్ణెల్లయింది. తల్లి తోబుట్టువులకంటె యెక్కువగా నాగమ్మ రాత్రనక, పగలనక కష్టపడి బాలెంతనూ, పిల్లవాన్నీ కాపాడింది. సీతమ్మకు నాగమ్మయం దిదివరకున్న యభిమానం యినుమడించింది. తనకు తోబుట్టువులు లేని కొరత తీరింది. లక్ష్మిను తనతమ్మునికి చేసుకోవడంతో బాంధవ్యం యేర్పడునను సంతోషం. పురుటిలో చూచిపోవడానికి తల్లి వచ్చినప్పు డీవిషయం ప్రస్తాపించగా ఆమె పిల్లనుజూచి తనమనసుకు నచ్చిందని చెప్పింది. వేసవి సెలవులలో వివాహం జరపవలెనని సీతమ్మతలంపు.

ఇప్పుడు వారంరోజులనుండి నాగమ్మకు జ్వరం. ఉష్ణ మంతతీవ్రంగాలేదు కాని మనిషి చాలా జడిసిపోయి మంచంపట్టింది. లక్ష్మి సహాయంతో యింటిపనంతా చూచుకొంటూ సీతమ్మ చాలశ్రద్ధగా పథ్యం చేసి యిస్తూ, నాగమ్మను పరామరిక చేస్తూవుంది. నాగమ్మ చాలబలహీనంగా వుంది. ఎంత బలవంతం జేసినా ఆహారం తీసుకోదు. కండ్లుమూసుకొని యేదో చింతచేస్తూ వుంటుంది. లక్ష్మి, పాపం, చాల భయపడిపోయింది.

ఆదివారం మధ్యాహ్నం నాగమ్మ మంచంమీద పడివుంది. కండ్లకొలుకులలో నుండి నీళ్లొకేధారగా పోతున్నాయి. అప్పుడు సీతమ్మ,

"నాగమ్మా, నీ కేంభయం? ఇంతమాత్రం జ్వరానికే జడిసిపోవాలనా. వూరకే పిల్లను జడిపుస్తున్నావు. ప్రొద్దున్నుంచి కొంచెమైనా ఆహారం తీసుకోలేదు. ఇప్పుడు కొంచెం గంజి కాచియిస్తాను తీసుకుంటావా."

నాగమ్మ కండ్లుమూసుకునే "సరే" అంది. సీతమ్మ, "లక్ష్మీ, పోయి వంటచేయి పో. నేను గోధుమనూక చూస్తాను" అంటూ వంటింటికి లక్ష్మితో పోయింది.

హాలులో పేపరుచూస్తూవుండిన వెంకటరెడ్డి ఆన గదిలోనుండి భార్యరూములోకి వెళ్లినాడు. నాగమ్మ మంచంపై పడివుంది.

వెంకట—(మెల్లగా) నాగూ, నీకు జ్వర మె ట్లుంది?

నాగమ్మ కండ్లువిప్పి చూచింది కండ్లు నీళ్లలో తేలుతున్నాయి. నోటనూటరాలేదు. తల పక్కకు తిప్పింది.

వెంకట—ఎందు కంతగా యేడుస్తున్నావు? డాక్టరుకు చెప్పినాను. సాయంకాలంవస్తాడు. యేం భయం లేదులే.

నాగమ్మ తటాలున వెంకటరెడ్డివైపు చూచింది. ఆకండ్లలో యిదివర కెన్నడూలేని తీక్ష్ణత కనబడుతూ వుంది.

నాగమ్మ—నాకు మందూవద్దు, వైద్యుడూ రానక్కరలేదు. కొంచెం విషముంటేయిచ్చి పుణ్యం కట్టుకోండి.

అని యేడ్వడ మారంభించిది.

వెంకటరెడ్డి కేమీ అర్థంకాలేదు. దగ్గరగావెళ్లి చేయిపట్టుకొని "ఏమికారణం? చావవలసినంత పని యేముంది? నీ కేకష్టమున్నా నే తీర్చలేనా. నాతో చెప్పు."

నాగమ్మ—నే నింక బ్రతకకూడదు. నాకు మాత్రమేకాక మీకూడా మర్యాదపోతుంది.

అని రెండుచేతులతో ముఖం కప్పుకొని యేడ్వడ మారంభించింది. వెంకటరెడ్డి నెత్తిపై పిడుగుపడి నట్లయింది. తలవంచుకొని మెల్లగా వెళ్లిపోయినాడు.

నీళ్లివ్వడానికి వచ్చినసీతమ్మ మగడుమాట్లాడు చున్నది విని బైటనే నిలబడింది. సంభాషణ పూర్తిగా విని నిశ్చేష్టురాలయింది. అంతలో లక్ష్మురాగా నాగమ్మకివ్వమని నీళ్లాపిల్ల చేతికిచ్చి, తాను చరచరవంటింటికి వెళ్లిపోయింది.

సదా కలకలలాడుతూవున్న గృహ మిప్పుడు కళావిహీనంగా కనబడుతూవుంది. భార్యాభర్తల కెడమొగము పెడమొగమయింది. సీతమ్మ దినమంతా వంటింటనే గడపడం. వెంకటరెడ్డి భార్యను పలకరించడానికూడా జంకుచున్నాడు. తనకేకాక తనభార్యకూడా నిద్రాహారములు లేవని గ్రహించి పిచ్చివానివలె కాలం వెళ్లబుచ్చుతున్నాడు. నాగమ్మకు జ్వరం హెచ్చింది. అప్పుడప్పు డేవేవో కలవరింతలు, లక్ష్మమ్మ గుండెనీరయింది. ఏమీ తెలియని యాపిల్ల కేడ్పేశరణ్యం. మనస్సు కెంతకష్టమున్నా సీతమ్మ నాగమ్మను శ్రద్ధగా విచారిస్తూవుంది. తనసంసారాన్ని భంగపరచిందని యేవగింపొకప్రక్క. ఇప్పట్లో తానుచేయివదలిన యీ పిల్లగతి యేమనిజాలి యొకప్రక్క. బాలవితంతువుల దుర్గతిని గూర్చిన తనభర్త యుపన్యాసములన్నీ జ్ఞప్తికి వచ్చినవి సీతమ్మకు. "సర్వత్ర, వారిదుస్థితికి పురుషుడే కారణము" అని తనభర్త పలుమారు బలుకుచుండిన మాట యామెస్ఫురణకు వచ్చినది. ఈ సందర్భమందునూ ఆపలుకులే తథ్యములై యుండునని తోచిందీమె మనస్సుకు. ఎట్లైనను నాగమ్మ నిప్పట్లో చేయివిడువ కూడదని నిశ్చయించి స్త్రీసామాన్యమునకు సాధ్యము కాని ఔదార్యంచూపింది. భర్త తనయెదుట వచ్చి నప్పుడుమాత్రం కోపమూ, దుఃఖమూ యేకమై సీతమ్మ హృదయాన్ని రంపపుకోత కెరజేయుచున్నవి.

ఈస్థితిలో మూడురోజులు గడచినవి. వేసవి సెలవులకు కోర్టులూ, పాఠశాలలూ మూతబడినవి. కృష్ణారెడ్డి వివాహాన్ని స్థిరపరచుకోడానికై వచ్చినాడు. అక్కగృహము సంతోషరహితమై యుండుట గోచరించినది. నాగమ్మజ్వర మందులకుకారణమైయుండునని మొదటయూహించినాడుకాని, అక్కబావలకు విరసముగానుండుట చూచి తనయూహ సరికా దనుకున్నాడు. అక్కను ప్రశ్నించినాడుకాని, ప్రయోజనం లేకపోయింది. బావయందు తనకుండుచనవుతో అతన్ని పీడించినాడు. లోననేకుళ్లి కుముల్తూవున్న వెంకటరెడ్డికిప్పుడు తనహృదయభారం తగ్గించుకోడాని కవకాశం గల్గింది. మనసిచ్చి సంగతంతా వెళ్లగక్కినాడు. తప్పంతా తనదేనని వప్పుకొని, దిక్కులేక తనయింట జేరిన స్త్రీజీవితాన్ని నాశనంజేసినానని పశ్చాత్తాపపడినాడు. ముందుగతి యేమని బాలికవలె యేడ్చినాడు.

క్రిష్ణారెడ్డి అక్కతో బావస్థితిని వర్ణించి, ఆమె మనస్సుపై యిరువురిజీవితము లాధారపడి యున్నవని తెలియజెప్పినాడు. స్వభావముగనే కారుణ్యమయమగు సీతమ్మ హృదయమును ఉదారహృదయుడగు తమ్ముని హితబోధ మెత్తబరచింది.

సీతమ్మ—మగవారు చేసినపనికి స్త్రీ యేం చేస్తుంది? నేనిప్పుడు వారి నేమనేటట్టున్నాను! భరించక తప్పుతుందా.

క్రిష్ణా—అట్లుకాదు. బావను క్షమించడమేకాక నీవు గొప్పమనస్సుచేసి నాగమ్మ కొకమార్గం చూపవలసివుంది. తప్పంతా తనదేనని అతడే వప్పుకున్నాడు. నీమగడు చేసినదానికి నాగమ్మజీవితం నాశంకావడం యేమిన్యాయం? అతడుచేసిన తప్పును నీవు సరిదిద్దవలసింది.

సీతమ్మ—ఐతే నన్నేంచేయమంటావు? నాకేం సాధ్యముంది?

క్రిష్ణా—గొప్పమనసుచేస్తే సాధ్యముంది. బావకే అపకీర్తికూడా లేకపోతుంది.

సీతమ్మ—నాకేం తోచడంలేదు. నీవేచెప్పు. నా సాధ్యమయింది అయనకై చేయడానికి సిద్ధమేకదూ!

క్రిష్ణా—నాగమ్మను బావ పెండ్లిచేసుకుంటే అన్నీ సరిపోతాయి. నీమాటమీదుందీవిషయం.

సీతమ్మ బొమ్మవలె నిలబడిపోయింది కొంతసేపు. ఆమెహృదయంలోనికలత ముఖంలో ప్రతిబింబిస్తూవుంది. స్త్రీసహజమైన యీర్ష్యను గెలువజాలింది తుదకు. తలవంచుకొనే,

సీతమ్మ—అవును, వేరుమార్గంలేదు. ఆయన వప్పుకున్నారా?

క్రిష్ణా—నేనడుగలేదు కాని, నీమాట కెదురాడే స్థితిలో లేడు.

సీతమ్మ— వప్పుకొనితీరవలసిందే. లేక నన్నుకూడా వదలుకోవలసింది.

అంటూ, చరచర భర్తగదిలోకి వెళ్లింది. ఆమె చూపు నెదుర్కొ లేకపోయినాడు సంకటరెడ్డి. మాటల కవకాశమియ్యక సీతమ్మ,

"మీరు నాగమ్మ జీవితాన్ని నాశంచేసినారు. అందు కిప్పు డామెను మీరు పెండ్లిచేసికోవడం తప్పదు. ఇందుకు నేను మనసార వప్పుకుంటున్నాను" అని గంభీరంగా పలికింది.

సీతమ్మ గదికిని, యీగదికిని మధ్యతలుపు తెరచివుంది. అప్పుడేలేచి లక్ష్మియిచ్చిన నీళ్లు తాగుతూన్న నాగమ్మ యీమాటలువిని, 'ఆ' యని యరచి మంచముపై వ్రాలి యేడ్వడ మారంభించింది. సీతమ్మ తక్షణం వెళ్లి నాగమ్మప్రక్కన కూర్చుని,

"నాగమ్మా, మనమిప్పుడు నిజంగా అక్కచెల్లెండ్లయినాము. నీతప్పేంలేదు. అంతా విధి. ఆయన సిగ్గుతో కుంగిపోతున్నాడు. ఇకముందు మనిద్దరమూ ఆయన్ను సుఖపెట్టవలసివుంది. నీవు ధైర్యం తెచ్చుకో" అని యామెను ఓదార్చి, తమ్ముని పిలిచింది.

సీతమ్మ—క్రిష్ణా, లక్ష్మినను పెండ్లిచేసుకోడానికి నీవుసిద్ధమేనా?

క్రిష్ణా—నీమాటకు బదులేముంది? సంఘసంస్కర్తభార్య కదూ నీవు.

సీతమ్మ—నీహాస్యం చాలు. పులి గోతిలోబడిందని రాళ్లేస్తున్నావు. ఆయనవింటే యింకానొచ్చుకుంటారు. కాని, రెండుపెండ్లిండ్లు, యీవూర్లో బాగుండదేమో?

క్రిష్ణా—ఎటూ సెలవురోజులు. అందరూ బెంగుళూరుపోతే బాగుంటుంది.

సీతమ్మ—అవును. నీవూ మీబావా కలిసి ప్రయాణాని కేర్పాటుచేయండి. నాగమ్మా, లే. వంటింట్లోకి పోదాం. నేను గంజికాస్తాను. నీవూ అక్కడనే కూర్చుండు.